తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శనివారం
2 మే 2026
పేజీలు : 08






# 8 గంటల పనిదినానికై ఉద్యమిద్దాం

> ప్రైవేట్ ఉద్యోగులకు కనీస పనిదినాల, కనీస సెలవులు వారి ప్రాథమిక హక్కుకై పోరాడుదాం..

## చికాగో పోరాటం కార్మిక హక్కుల పునాది

- 12 గంటల పనిదినాలపై కేంద్ర విధానాలపై విమర్శలు
- లేబర్ కోడ్స్‌తో శ్రమదోపిడీ పెరుగుతుందన్న ఆందోళన

ప్రైవేట్ ఉద్యోగులకు సెలవులు కల్పించడం వారి ప్రాథమిక హక్కు అని, మేడే స్ఫూర్తితో రోజుకు ఎనిమిది గంటల పనిదినాన్ని కాపాడుకోవడానికి కార్మికులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని సిఐటియు నాయకులు ఎం చంద్రమోహన్, ఆలేటి ఎల్లయ్య పిలుపునిచ్చారు. వనస్థలిపురం రైతు బజార్ చౌరస్తాలో చిరు వ్యాపారస్తులు, తోపుడు బండ్ల కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి ఆలేటి ఎల్లయ్య అధ్యక్షత వహించగా, యూనియన్ అధ్యక్షురాలు భారతమ్మ ఎర్రజెండా ఆవిష్కరించారు.

హయత్ నగర్, మే 01 (జనం సాక్షి): లోపలి పేజీలో



## కార్మిక సంక్షేమంలో ఆర్బీఓఎల్ మరో మైలురాయి

ఆర్బిఓఎల్ కు ఉత్తమ యాజమాన్య అవార్డు.
మే డే సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ బయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డికి ఘన సన్మానం.



మెయిన్‌లో

## కాంగ్రెస్‌తోనే గ్రామాభివృద్ధి సాధ్యం

- పెద్దేముల్‌కు రూ.4.44 కోట్ల నిధులు
- బీఆర్ఎస్ వ్యాఖ్యలు అర్థరహితం
- ఆరోపణలపై కాంగ్రెస్ నేతల కౌంటర్
- అభివృద్ధిపై చర్చకు సిద్ధమన్న కాంగ్రెస్





## ఫేస్ ఫోటో క్యాప్చర్ తిప్పలు.. ఉపాధి కూలీల ఆవేదన

- నెట్ సమస్యలతో గంటల తరబడి నిరీక్షణ
- ఉదయం-మధ్యాహ్నం ఫోటోలు తప్పనిసరిపై అసంతృప్తి
- ట్రైనింగ్ లేక ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- ప్రత్యామ్నాయ హాజరు విధానం కోరుతున్న కూలీలు

మెయిన్‌లో

## కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం

- నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి
- మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రవిచంద్రన్ డిమాండ్
- లేబర్ అడ్డా వద్ద వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి




మెయిన్‌లో

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**షాబాద్, మే 01 (జనం సాక్షి) :** ప్రజా పాలన సంక్షేమ పథకాలతో ముందుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలు చూస్తున్నారని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొమరబండ స్వతంత్ర అభ్యర్థి సర్పంచ్ కుక్కల పద్మమ్మ గోపాల్, నాయకులు జంగం బసిలింగం, శేఖర్, జంగయ్య, రాము, హరీష్ తదితరులు ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఆరు గ్యారంటీలు అమలుతో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిరకాలంగా నిలిచిపోతుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, జాంగిర్, గంధ అంజయ్య, పాల్గొన్నారు.

# ఈడబ్లుఎస్ కోటా అమలులో ప్రభుత్వం విఫలం

**రాజేంద్రనగర్, మే1(జనంసాక్షి)** ఈడబ్లుఎస్ విద్యార్థుల భవిష్యత్తు సంక్షోభంలో తెలంగాణ రాష్ట్రంలో ఆర్థికంగా బలహీన వర్గాల విద్యార్థుల విద్య హక్కు అమలు విషయంలో తీవ్ర లోపాలు ఉన్నట్లు సిటిజెన్ కౌన్సిల్ వెల్లడించింది. శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా వెల్లడిస్తూ, రైట్ టు ఎడ్యుకేషనల్ యాక్ట్ 2009 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాల్సి ఉన్నప్పటికీ, రాష్ట్రంలో అది సక్రమంగా అమలు కావడం లేదని పేర్కొంది. ఇక ప్రభుత్వం హామీ ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కూడా దాదాపు నిలిచిపోయినట్లు ఆరోపించింది. కాలేజీలకు భారీగా బకాయిలు ఉండటంతో, విద్యాసంస్థలు నేరుగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపింది. ఫీజులు చెల్లించలేని విద్యార్థులను తరగతులకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇది విద్య హక్కు (ఆర్టికల్ 21ఎ)కు విరుద్ధమని, సమాన అవకాశాల సూత్రాన్ని దెబ్బతీస్తోందని పేర్కొంది. సిటిజెన్ కౌన్సిల్ సభ్యులు పాఠశాలలను పరిశీలించిన సమయంలో ఈడబ్లుఎస్ కోటాకు సంబంధించిన వివరాలు బోర్డులపై ప్రదర్శించకపోవడం గమనించామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆర్టీఈ చట్టంలోని 25 శాతం కోటాను వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఈడబ్లుఎస్ అడ్మిషన్లకు పారదర్శక ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకురావాలని, ప్రతి పాఠశాలలో ఈడబ్లుఎస్ మాచారం బోర్డులపై తప్పనిసరిగా ప్రదర్శించాలని సిటిజెన్ కౌన్సిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పేద విద్యార్థులను విద్య నుండి దూరం చేయడం సమాజ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం వంటిదని, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది.

## మేడే సందర్భంగా మున్సిపల్ కార్మికుల పోరాట పిలుపు




**రాజేంద్రనగర్, మే1(జనంసాక్షి)** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా రాజేంద్రనగర్ మండల కేంద్రంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మైలార్ దేవ్‌పల్లి చౌరస్తా, రాజేంద్రనగర్ మున్సిపల్ జోన్ కార్యాలయం వద్ద జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చికాగోలో కార్మికుల పోరాటాల ఫలితంగా 8 గంటల పని చట్టం, కనీస వేతనాలు వంటి హక్కులు సాధించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక హక్కులను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మనెంట్ చేయాలని, అప్పటివరకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మే నెలలో మున్సిపల్ శాఖ మంత్రి మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నివాసాల వరకు పాదయాత్ర నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి మండల ఏఐటీయూసీ నాయకులు టి. ఆనంద్ అధ్యక్షత వహించగా, పలువురు కార్మిక నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నవ దంపతులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**బంట్వారం ఏప్రిల్ 30(జనం సాక్షి)** బంట్వారం మండల కేంద్రంలోని కరీంపురం మ్యాట్నీ ఫంక్షన్ హాల్ లో శుభకార్యం పెండ్లి పురుషోత్తం భానుప్రియ వివాహానికి హాజరైనా తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యి నవ దంపతులను ఆశీర్వదించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పి ఎల్ పౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జస్వంత్ తేజ్ కార్యదర్శి పిల్లిడి బాలకృష్ణ చీఫ్ బంధువులు తదితరులు ఈ శుభకార్యంలో పాలుపంచుకున్నారు.

## ఘనంగా సిఐటియు బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు




నిజాంపేట్ మే 1( జనం సాక్షి) నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ లో మేడే సందర్భంగా సుందరయ్య భవన్ లో నిర్వహించిన మే డే సభలకు సిఐటియు బాచుపల్లి మండల కార్యదర్శి రాథోడ్ సంతోష్ అధ్యక్షత మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య హాజరై సిఐటియు జెండా ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ ఆఫీస్ నుండి సుందరయ్య భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య భవనంలో జరిగిన "ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే మేడే సభలో ఎస్. వీరయ్య ప్రసంగిస్తూ ఈరోజు మేడే ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా కార్మికులు కర్షకులు ప్రజలు ప్రతి ఏటా మేడే రోజు ప్రపంచ కార్మికుల దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు పెట్టుబడిదారులు, భూస్వాములు ఈ దేశాన్ని పరిపాలించడం పోవాలని కార్మిక వర్గం దేశాన్ని పరిపాలించే రోజు రావాలని అన్నారు కార్మిక హక్కులను, సాధించుకోవాలన్న ధరలు తగ్గించాలన్న, కార్మిక చట్టాలు కార్మికులకు అనుకూలంగా రావాలన్నా కార్మిక వర్గం దేశాన్ని పరిపాలించాలి 140 ఏళ్ల క్రింద ఎనిమిది గంటల పని దినం కోసం పోరాటం జరిగితే, ఇప్పటికీ అవి అమలు జరగడం లేదు. ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీలలో కాంట్రాక్టు పద్ధతి కొనసాగిస్తూ 12 గంటల పని దినాన్ని కార్మికులకు పనిచేయిస్తూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని అన్నారు, కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ, 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకు వచ్చిందని ఆయన అన్నారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా వచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని కేవలం ఒక ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే పోరాడాయి. మే డే స్ఫూర్తితో కార్మిక వర్గం పెట్టుబడిదారీ వ్యవస్థపై పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికుల హక్కులు కాలరాశి పోతున్నాయి, కార్మికులకు అందరికీ విద్యా,వైద్యం, ఎన్ని గంటల పని దినం,సమాన హక్కులు రావాలంటే సోషలిస్టు వ్యవస్థ కార్మిక వర్గం మన హక్కుల కోసం మరింత బల్లోపేతం చేస్తూ వివిధ స్థాయిలో ఎర్రజెండా నాయకత్వాన్ని తీసుకురావాలని ఆయన అన్నారు. ఇతర దేశాలపై చేస్తున్న దాడుల వల్ల ప్రజలు, కార్మికులు కర్షకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు, ఈ మధ్యకాలంలో పెట్రోల్ డీజిల్ గ్యాస్ ప్రజలకు దొరకట్లేదు అంటే సామ్రాజ్యవాదం అమెరికా దేశం చేస్తున్న వివిధ దేశాలపై యుద్ధాలే కారణమని అన్నారు, పెరిగిన ధరలన్నిటిని తగ్గిస్తూ నిత్యవసర సరుకులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని హెచ్చరించారు, బాచుపల్లి మండలంలో మేడే సందర్భంగా మునిసిపల్, అలీఫ్, బాచుపల్లి,ఇండస్ట్రియల్ ఏరియా, ఆటో, తోపుడు బండ్ల, భవన నిర్మాణ యూనియన్ల ఆధ్వర్యంలో సిఐటియు జెండా లు ఆవిష్కరించడం జరిగింది,ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ బాచుపల్లి మండల కార్యదర్శి బి. వెంకటరామయ్య సిఐటియు మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వెంకట రాజం, సిఐటియు సీనియర్ నాయకులు నాగభూషణ్ సిఐటియు బాచుపల్లి మండల కార్యదర్శి రాథోడ్ సంతోష్, సిఐటియు బాచుపల్లి మండల నాయకులు పెంటయ్య, పి.స్వామి, పెద్దాపురం భాస్కర్, బాల పీర్, నరసింహ, ఎల్లమ్మ, బాల వెంకటేశ్వర్లు, లింగమ్మ, లక్ష్మీ, నాగరాజు, ఏడుకొండలు, వెంకటేష్, నరసింహ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు...

# రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి

### జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి
### డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**బొంరాస్ పేట,మే 1(జనం సాక్షి):** రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నాడని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తుంకిమెట్ల గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వము ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలలో మాత్రమే విక్రయించుకుని మద్దతు ధర పొందాలన్నారు. ప్రభుత్వము సూచించిన మార్గదర్శకదాకాలను పాటించి ధాన్యం సరైన తేమశాతం ఉండేలా ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389,బి గ్రేడ్ ధాన్యానికి రూ.2,369 చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్, కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్,పిఏసిఎస్ మాజీ చైర్మన్ జయకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్, సర్పంచ్ ఎర్ర ఎల్లమ్మ,ఏఈవో శైలజ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంజిల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్,కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు సంతోష్ నాయక్,హనీఫ్,మోహన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# పెద్ద అంబర్‌పేట్‌లో ఘనంగా మేడే వేడుకలు



**అబ్దుల్లాపూర్ మెట్టు, మే 1(జనం సాక్షి):** పెద్ద అంబర్‌పేట్, నాగోల్ సర్కిల్ పరిధిలో సిఐటీయూ ఆధ్వర్యంలో మేడే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్కిల్ కార్యాలయం ముందు జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అలుగుపల్లి నర్సిరెడ్డి జెండా ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి సభ ఏర్పాటు చేశారు. సభలో నర్సిరెడ్డి మాట్లాడుతూ మేడే రోజు కార్మికుల పోరాటాలకు ప్రతీకగా నిలిచిందని, 8 గంటల పని దినాన్ని కార్మికులు తమ రక్తంతో సాధించుకున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్త లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికుల హక్కులను దెబ్బతీస్తోందని విమర్శించారు. కార్మికులు లేకుండా ప్రపంచం నడవదని ఆయన అన్నారు. సిఐటీయూ జిల్లా నాయకుడు ఎర్పుల నర్సింహ్ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉండి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటీయూ నాయకులు మైసయ్య, జంగయ్య, నర్సింహ, నరేష్, జగన్, మహిపాల్, జ్యోతి తదితరులు పాల్గొనగా, వందల సంఖ్యలో కార్మికులు హాజరయ్యారు. ఇదే సందర్భంలో అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని మెట్టు, అనాజ్‌పూర్, బట్టిసింగారం, జాఫర్‌గూడ, లాస్కర్‌గూడ, కావాడిపల్లి ప్రాంతాల్లో సిఐటీయూ, సీపీఎం జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో శివకుమార్, బాలరాజు, ముత్యాలు, వెంకటేష్, విష్ణు, జంగయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

# డిండి శ్రీనివాసులుకు శ్రామిక శక్తి పురస్కారం




**మల్కాజ్గిరి మే 1(జనంసాక్షి)** ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యుత్ శాఖలో ఉత్తమ సేవలు అందిస్తున్న డిండి శ్రీనివాసులుకు ప్రతిష్ఠాత్మకమైన శ్రామిక శక్తి అవార్డు లభించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆనంద్‌బాగ్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూనే, ఐఎన్‌టీయూసీ డివిజన్ అధ్యక్షుడిగా కార్మికుల సమస్యల పరిష్కారంలో డిండి శ్రీనివాసులు చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన కమిటీ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ చేతుల మీదుగా శ్రీనివాసులు ఈ అవార్డును స్వీకరించారు. వృత్తి పట్ల నిబద్ధతతో పాటు కార్మిక సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న శ్రీనివాసులుకు అవార్డు రావడం పట్ల సహచర ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రీజినల్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావుతో పాటు పలువురు కార్మిక సంఘాల నేతలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# పనిచేసే చోట వేధిస్తే సమాచారం ఇవ్వండి

## కోట్ పల్లి ఎస్ఐ శైలజ



**కోట్ పల్లి మే 01 (జనం సాక్షి) :** పనిచేసే చోట మహిళలను వేధిస్తే సమాచారం ఇవ్వాలని కోట్ పల్లి ఎస్ఐ శైలజ తెలిపారు. మహిళ భద్రతపై ఎస్ఐ శైలజ మాట్లాడుతూ .... మహిళలు పనిచేసే ప్రదేశాల్లో భద్రత అత్యంత ముఖ్యమని, ఎక్కడైనా వేధింపులకు గురైతే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వర్క్ ప్లేస్లో ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, కష్టమర్ల ద్వారా ఇబ్బందులు కలిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంటి నుండి పని చేసే చోటికి వచ్చే సమయంలో లేదా తిరిగి ఇంటికి వెళ్లే సమ యంలో ఎవరైనా ఫాలో అవుతూ, వేధింపులకు గురిచేస్తే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే మెసేజులు,కాల్స్ ద్వారా వేధింపులు కూడా నేరాలేనని, అలాంటి సందర్భాల్లో వెంటనే స్పందిం చాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో యువతతో పాటు మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అనుమా నాస్పద వ్యక్తుల గురించి సమాచారం ఇవ్వాలని చెప్పారు. అలాగే సైబర్ నేరగాళ్ల నుండి రక్షణ కోసం వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని, అపరిచిత లింకులు ఓపెన్ చేయకూడదని హెచ్చరించారు. ప్రయాణ సమయంలో రోడ్డు ప్రమాదాలు జరగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి సమయంలో ఒంటరిగా ప్రయాణించే మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆశతో ఉండాలి కానీ అత్యాశకు పోకూడదుఅని పేర్కొంటూ, మోస పూరిత ఆఫర్లు, స్కీమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరికైనా ఇబ్బందు లు ఉంటే వెంటనే తెలియ జేయాలని కోరారు 100 డయల్ లేదా సమీపాన ఉన్నా పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

# మే డే వేడుకలతో ఉప్పల్‌లో కార్మికుల సందడి

**ఉప్పల్ మే 01 ( జనం సాక్షి ):** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ఈ రోజు మే 1న ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ క్రాస్ రోడ్స్, రామంతపూర్, హబ్సిగూడ, తదితర ప్రాంతాల్లో వివిధ పార్టీ నాయకులు, కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఘనంగా మే డే వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచే పలు ప్రాంతాల్లో కార్మిక సంఘాల కార్యాలయాల వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించి కార్మిక అమరవీరులకు నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న పార్టీ నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్మికుల శ్రమతోనే పరిశ్రమలు, నిర్మాణ రంగం, రవాణా వ్యవస్థలు ముందుకు సాగుతున్నాయని కొనియాడారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలపై ప్రభుత్వాలు మరింత దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుండి రామంతపూర్ వరకు పలు సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఎర్రజెండాలు చేతబట్టి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. కొన్నిచోట్ల డప్పుల వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కార్మిక గేయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళా కార్మికులు, యువత కూడా ఉత్సాహంగా పాల్గొనడంతో ప్రాంతం మొత్తం మే డే సందడితో కళకళలాడింది. మే డే సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, కార్మికులకు సన్మాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. కార్మిక కుటుంబాలకు అవసరమైన వస్తువులను పంపిణీ చేస్తూ పార్టీ నాయకులు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమాల నేపథ్యంలో ఉప్పల్ ప్రధాన రహదారి, రామంతపూర్ జంక్షన్, హబ్సిగూడ మార్గాల్లో ట్రాఫిక్ స్వల్పంగా నెమ్మదించే అవకాశం ఉందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ సిబ్బంది సూచనలు పాటించాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని సూచించారు. మే డే సందర్భంగా ఉప్పల్, రామంతపూర్ ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్మిక సంఘాలు కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమాలు కార్మికుల ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి.

# శంషాబాద్‌లో ఘనంగా మేడే వేడుకలు



**శంషాబాద్,మే1(జనంసాక్షి)** శంషాబాద్ మండల కేంద్రంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే)ను ఘనంగా నిర్వహించారు. "ప్రపంచ కార్మికులారా ఏకంకండి, పోరాడితే పోయేది బానిస సంకెళ్లు తప్ప మరేమీ లేదు" అనే నినాదాలతో కార్యక్రమం సాగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, అమెరికాలోని చికాగోలో కార్మికుల పోరాటాల ద్వారా పని గంటలు, కనీస వేతనాలు వంటి హక్కులు సాధించుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను విమర్శిస్తూ, వాటి రద్దు వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. సిపిఐ,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నర్రగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కార్మిక సంఘాలు, నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాల్లగూడలో కూడా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. కార్మికుల హక్కుల కోసం మేడేను పోరాట దినంగా మార్చి భవిష్యత్తులో మరింత బలమైన ఉద్యమాలు చేపట్టాలని నాయకులు పిలుపునిచ్చారు.

# మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా సుమతి బాధ్యతల స్వీకరణ




మల్కాజిగిరి, మే 1 (జనంసాక్షి) మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్‌గా సీనియర్ అధికారిణి సుమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నేరెడ్ మెట్ లోని కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్న ఆమెకు పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, మల్కాజిగిరి కమిషనరేట్‌కు తొలి మహిళా పోలీస్ కమిషనర్‌గా నియమితులు కావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు అత్యంత పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే నా ప్రథమ కర్తవ్యం. మల్కాజిగిరి ప్రాంతానికి ఉన్న ప్రశాంతమైన పేరును కాపాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తామని సీపీ తెలిపారు. సైబర్ నేరాల పట్ల 'ప్రాసెస్ అండ్ రిజల్ట్ ఓరియెంటెడ్' విధానంతో వ్యవహరిస్తామని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. యువత మత్తుకు బానిస కాకుండా ఏఐ ఆధారిత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పెద్దపీట వేయనున్నట్లు సుమతి పేర్కొన్నారు. పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, సిటిజన్స్ ప్రయాణ సేఫ్టీని ఇంప్రూవ్ చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. క్వాలిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని రెట్టింపు చేస్తామని భరోసా ఇచ్చారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి, సహకరించిన డీజీపీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు డీసీపీలు, ఏసీపీలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయుత

**దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు.**



**తాండూరు మే 1(జనంసాక్షి)** మృతురాలి కుటుంబ సభ్యులకు దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు ఆర్థిక చేయుతనందించారు. శుక్రవారం యాలాల మండలం దేవనూర్ గ్రామానికి చెందిన మంగలి లక్ష్మమ్మ మృతి చెందారు. ఈ విషయం గ్రామ యువకులచే తెలుకున్నారు. వెంటనే కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థిక సహాయంఅందజేశారు. అదేవిధంగామనోధై ర్యం కల్పించారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలోయువనాయకుల కిరణ్ కుమార్, సీనియర్ నాయకుడు వెంకటయ్య,తదితరులు ఉన్నారు

# నంది వనపర్తిలో ఘనంగా మేడే ఉత్సవాలు

## కార్మికులకు ఘన సన్మానం



**యాచారం, మే 1(జనం సాక్షి )** కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని, నంది వనపర్తి గ్రామంలో సామజిక ఉద్యమ నేత కొంగరి లింగం అధ్యర్యంలో గ్రామపంచాయతీ ఆవరణంలో నంది వనపర్తి గ్రామ కార్మికులకు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సన్మాన కార్యక్రమానికి విచ్చేసిన పెద్దలకు, కార్మిక కర్షక సోదరులకు మే డే శుభాకాంక్షలు తెలుపుతూ, పంచాయతీ సిబ్బందికి, తాపీ, ట్రాక్టర్, సెంట్రింగ్, ఆటో, వ్యవసాయ కార్మికులకు శాలువాలతో సత్కరించి, స్వీట్లు పంచారు. ఏ ఒక్క కార్మికుడు లేకపోయినా ఈ ప్రపంచం ఆగుతుంది, ఆగిపోతుందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రపంచాన్ని తమ రెక్కల కష్టంతో నడిపిస్తున్న కార్మిక లోకానికి పాదాభివందనాలు అంటూ మేడే శుభాకాంక్షలు తెలిపారు.

# రైల్వే స్టేషన్‌లో దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు నేరస్తుల అరెస్ట్

సికింద్రాబాద్(జనంసాక్షి):: సికింద్రాబాద్ రైల్వే పోలీస్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో దోపిడీకి పాల్పడిన ఇద్దరు పాత నేరస్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.200 నగదు,దాడికి ఉపయోగించిన మడత కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం రైల్వే డిఎస్పి జావెద్ మీడియాకు వివరాలు వెల్లడించారు. నేరేడ్ మెట్ ప్రాం తానికి చెందిన థాండూర్ మహేందర్ (20), సికింద్రాబాద్ రెజిమెంటల్ ప్రాంతానికి చెందిన పెగడ అంజలి (30)ఖాళీ సీసాలు సేకరించి అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి అలవాటు పడిన వీరు తమ జల్సాలు తీర్చుకోవడానికి అవసరమైన డబ్బుల కోసం దొంగ తనాల బాట పట్టారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కేంద్రంగా ఎంచుకుని ఒంటరిగా ఉన్న వారిని బెదిరించి, వారి వద్ద నుంచి డబ్బులు లాక్కొ ని ఉడాయిస్తున్నారు. నేరప్రవర్తనకు అలవాటు పడి, నేరెడ్మెట్, గోపాల పురం పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలోనూ పలు ఆస్తి నేరాల్లో పాల్గొన్నట్టు పోలీసులు తెలిపారు. జైలు శిక్ష అనుభవించిన ప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాక పోవడంతో తిరిగి నేరాలకు పాల్పడు తున్నారు. ఇదే క్రమంలో ఏప్రిల్ 29 రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన ఈ ఇద్దరు నిందితులు ఒక ప్రయాణికుడిని టార్గెట్ చేశారు. చేతిలో మడత కత్తి చూపిస్తూ డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. బాధితుడు



నిరాకరించడంతో మహేందర్ అతనిపై కత్తితో దాడి చేసి నుదుటి భాగం, కుడి చేతి వేళ్లు గాయపరిచాడు. అంతేకాక ముక్కుపై గుద్దడంతో బాధితుడు గాయపడ్డాడు. ఈ సమయంలో అంజలి బాధితుడి షర్ట్ జేబులో ఉన్న రూ.500ను లాక్కుని ఇద్దరూ అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన రైల్వే పోలీసులు, మే 1 ఉదయం సుమా రు 10 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ లో నేరాన్ని అంగీక రించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

## హైదరాబాద్ సభకు బీజేపీ సన్నాహక సమావేశం



**రాజేంద్రనగర్,మే1(జనంసాక్షి)** ప్రధాని నరేంద్ర మోడీ మే 10న హైదరాబాద్‌కు రానున్న సందర్భంగా, బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభకు సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్, మైలార్దేవ్‌పల్లి-2 అధ్యక్షుడు వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి పి. విజయలక్ష్మి మాట్లాడుతూ, రాజేంద్రనగర్ డివిజన్ నుంచి 600 మంది కార్యకర్తలు, నాయకులు, మోడీ అభిమానులు సభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ యాదవ్, గోల్కొండ జిల్లా ఇంచార్జ్ వైస్ శ్రీధర్, జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్, బొక్క బాల్ రెడ్డి, సోల్కర్ రెడ్డి, కోరిని సదానంద్, జోగు రవి, కోరని క్రాంతి, బాబురావు, వాసు, రవి, బాలకృష్ణ, శతజ్ఞ, యాదయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, రజనీకాంత్ గుప్తా, సరిత రెడ్డి, అంబికా, కవిత, రవి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ పౌరుడూ సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేయించుకోవాలి

### సినీ నటి, ఎమ్మెల్సీ విజయశాంతి



**ఖైరతాబాద్, మే 01 (జనం సాక్షి) :** జనాభా గణన -2027 కు సంబంధించిన స్వీయ గణన(సెల్ఫ్ ఎన్యూమరేషన్) సినీ నటి, ఎమ్మెల్సీ విజయశాంతి శుక్రవారం బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 12 ఎమ్మె ల్యే కాలనీలోని ఆమె నివాసంలో అధికారులు కలి శారు.ఈ సందర్బంగా సెల్ఫ్ ఏనుమేరేషన్ నమోదు చేయించుకున్నారు. అనంతరం విజయశాంతి మాట్లాడుతూ.. దేశానికి రాష్ట్రానికి సంబంధించిన అనేక సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు రూపకల్ప నకు, ఇతర పరిపాలన అవసరాలకు జనాభా లెక్క లు ఎంతో అవసరమని, ఇందుకు గాను ప్రభుత్వం నిర్వహించే జనాభా గణనకు స్వీయ గణన ద్వారా ప్రతి రాష్ట్ర పౌరుడు, హైద్రాబాద్ వాసులు ప్రభు త్వానికి, జిహెచ్ఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యకంలో జూబ్లీహిల్స్ సర్కిల్ ఉప కమిషనర్ ఎన్.శంకర్, అసిస్టెంట్ కమిషనర్ కైలాస్ చాంద్, పన్నుల అధికారి జయకృష్ణ, టెక్నికల్ పర్స న్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఖాతాల్లోనే ఫీజులు జమ చేయాలనే ప్రభుత్వ నిర్ణయం

### బిసి జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్



**తాండూరు మే 1(జనంసాక్షి)** రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని బిసి జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.ఈ నిర్ణయం ద్వారా విద్యార్థులకు నేరుగా లబ్ధి చేరడమే కాకుండా, కాలేజీ యాజమాన్యాలకు కూడా సకాలంలో ఫీజులు అందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు మధ్యవర్తిత్వం, ఆలస్యం వంటి సమస్యలు ఉండేవని, ఈ కొత్త విధానం వల్ల అవి గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఫీజులను స్వయంగా చెల్లించే విధానం ద్వారా బాధ్యత పెరుగుతుందని, అదే సమయంలో కాలేజీలకు కూడా ఆర్థిక ప్రవాహం సక్రమంగా జరుగుతుందని అన్నారు. దీంతో విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు.అదేవిధంగా, ఇప్పటికే కాలేజీ యాజమాన్యాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. బకాయిలు క్లియర్ చేస్తే, కాలేజీలు ఆర్థికంగా బలపడటమే కాకుండా, విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు అందించగలవని తెలిపారు. ఈ నిర్ణయం పారదర్శకతకు నిదర్శనమని, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని కొనియాడారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలను స్వాగతిస్తున్నామని తెలిపారు.

## కార్మికుల హక్కుల సాధనకు పోరాటం కొనసాగాలి

### ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, మే 1(జనం సాక్షి ) కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం కొనసాగాలని ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి అన్నారు. మే డే కార్మిక దినోత్సవాన్ని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో శు క్రవారం ఘనంగా నిర్వహించారు. ఐఎన్టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు పాలకూర్ల ఐలేష్ గౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా, కార్మికుల అడ్డా వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గుర్నాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ, కార్మికుల హక్కుల కోసం జరిగిన పోరాటాల చరిత్రను గుర్తు చేసుకున్నారు. పరిశ్రమల అభివృద్ధి నేపథ్యంలో కార్మికులు ఎదుర్కొన్న అన్యాయాలను అధిగమించేందుకు 8 గంటల పనిదినం కోసం 1886లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు పెద్ద ఎత్తున సమ్మె చేపట్టారని తెలిపారు. ఆ సమయంలో జరిగిన కాల్పుల్లో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం ప్రపంచ కార్మిక ఉద్యమానికి మార్గదర్శకంగా మారిందన్నారు. ఆ సంఘటనతో ప్రపంచవ్యాప్తంగా కార్మికుల ఐక్యత పెరిగి, వారి హక్కుల పరిరక్షణకు మార్గం సుగమమైందని చెప్పారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ మే 1ను కార్మిక దినోత్సవంగా ప్రకటించడం ద్వారా కార్మికుల సేవలను గుర్తించిందన్నారు. నేటి సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమైందని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు మరింత శ్రద్ధ చూపాలని సూచించారు. ఇప్పటికీ అనేక రంగాల్లో కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఆరోగ్య సదుపాయాలు వంటి అంశాల్లో మెరుగులు అవసరమని గుర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. కార్మిక సంఘాలు ఐక్యంగా పనిచేస్తేనే వారి హక్కులు సాధ్యమవుతాయని అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని, వారి హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈసీ శేఖర్ గౌడ్, కౌన్సిలర్ నీళ్ల భాను బాబు, రాఘవేంద్రరావు, నాయకులు మహమ్మద్ గౌస్, సుబ్బురు పాండు, సొప్పరి రవికుమార్, జక్కా కరుణాకర్ రెడ్డి, మడపు సాయితేజ, సాయి కుమార్, మంద కృష్ణ, ప్రభాక్, లక్ష్మయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రభుత్వం కార్మికుల సంక్షేమం, భద్రత కోసం నిరంతరం కృషి

### డిసిసి జిల్లా అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్



**తాండూరు మే 1(జనంసాక్షి)** ప్రజాప్రభుత్వం కార్మికుల సంక్షేమం మరియు వారి భద్రత కోసం నిరంతరం కృషి చేస్తుందని డిసిసి జిల్లా అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ పేర్కొన్నారు.ప్రపంచ కార్మికుల దినోత్సవ సందర్భంగా శుక్రవారం ఐఎన్టీయూసీ తాండూర్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో మే డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిసి వికారాబాద్ జిల్లా అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ , మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్ , మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ ఐ ఎన్ టి వి సి ఏర్పాటుచేసిన మే డే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా కార్మికులందరికీ కూడా కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం వారి యొక్క భద్రత కోసం నిరంతరం పనిచేస్తుందని కార్మికులందరూ లేబర్ ఆఫీస్ లో సభ్యులుగా చేరి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పొందాలని ఆయన అన్నారు. అనేక సంక్షేమ పథకాలు కార్మికుల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ కార్మికులందరూ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్టీసీ కార్మికుల సమస్యలను రెండు రోజుల్లోనే ప్రజా ప్రభుత్వం పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయడం జరిగిందని అన్నారు .అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో కార్మికులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసిందని కార్మికులందరూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని అన్నారు .అనంతరం మున్సిపల్ కార్మికులకు ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ తాండూర్ నియోజకవర్గ అధ్యక్షులు జిలాని న్యాయవాది మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని ముఖ్యంగా లేబర్ కార్డు లో సభ్యులుగా ఉన్నవారికి ఇద్దరు కూతుర్ల వివాహానికి 30 వేల రూపాయలు మరియు ఇద్దరు కూతుళ్ల డెలివరీ కోసం రెండు కాంతులకు 30000 రూపాయలు అదేవిధంగా సహజమాడనం పొందిన కార్మికునికి రెండు లక్షల రూపాయలు ప్రమాదవశాత్తు కార్మికుడు చనిపోతే 10 లక్షల రూపాయలు కార్మికులకు ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ యొక్క సంక్షేమ పథకాలు కార్మికులకు అందాలంటే లేబర్ ఆఫీస్ లో సభ్యునిగా మీ సేవ ద్వారా అప్లై చేసుకోవాలని సూచించారు. అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్ రూములు మరియు ఇందిరమ్మ ఇల్లు పెన్షన్లు ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి డిసిసి అధ్యక్షులు దారాసింగ్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు అనిల్ కుమార్ బషీరాబాద్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్ ఇన్చార్జిలు దొరశెట్టి సత్యమూర్తి, సాయప్ప ఎక్స్ కౌన్సిలర్లు వెంకన్న గౌడ్ బోయ రవిరాజు సీనియర్ నాయకులు శరణు బసప్ప కోల్వార్ నగేష్ వాజిద్ మియా మొయిజ్ బేగ్ మహిళా టౌన్ సెక్రెటరీ అమీనా బేగం పర్వీన్ భాను కుర్చీద్ కార్మికులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు



నిజాంపేట్ మే 1( జనం సాక్షి) 141వ ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిజాంపేట్ సర్కిల్ వార్డు కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం ఏఐటీయూసీ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. యేసు రత్నం, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1880లో చికాగో నగరంలో కార్మిక వర్గం ఎనిమిది గంటల పని దినాలు కోసం ఉద్యమించారు. ఈ ఉద్యమమే అన్ని పట్టణలకు మహా ప్రళయంగా విస్తరించింది అని అన్నారు. ఎనిమిది గంటల పని దినం కోసం జరిగిన పోరాటంలో ఎందరో కార్మికులు బలిదానాలయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అధ్యక్షులు, కార్యదర్శి ఆశి. యాదయ్య, దుర్గయ్య, బక్క మల్లేష్, మేకల.బాలకృష్ణ పొన్నకంటి దస్తగిరి, వాసు,సురేష్, జీతయ్య, కృష్ణ,పుష్పమ్మ, అమృత, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పల్ బీరప్పగడ్డలో బైక్ చోరీ కలకలం

# సీసీ కెమెరాల్లో రికార్డైన దొంగల కదలికలు

**ఉప్పల్ మే 01 ( జనం సాక్షి ):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని బీరప్పగడ్డ ప్రాంతంలో జరిగిన బైక్ చోరీ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. బీరప్పగడ్డలోని కోణార్క్ స్కూల్ సమీపంలో స్థానికంగా పార్క్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించగా, ఈ ఘటన అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డు కావడం కీలకంగా మారింది. ప్రస్తుతం ఆ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. స్థానికుల వివరాల ప్రకారం, బాధితుడు తన బైకును కోణార్క్ స్కూల్ పక్కన పార్క్ చేసి కొంతసేపటి తరువాత తిరిగి వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. దీంతో వెంటనే చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సమీప ప్రాంతాలను పరిశీలించి అక్కడి సీసీ కెమెరాల ఫుటేజ్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీసీ ఫుటేజ్‌లో ఇద్దరు అనుమానితులు ప్రాంతంలో సంచరిస్తూ వాహనాలను గమనించినట్లు తెలుస్తోంది. కొంతసేపు పరిసరాలను పరిశీలించిన అనంతరం వారు బైకును తీసుకెళ్లిన దృశ్యాలు కెమెరాల్లో రికార్డు అయినట్లు సమాచారం. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో కూడా వైరల్ అవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పాఠశాలకు సమీపంలో ఇలాంటి ఘటన జరగడం తల్లిదండ్రులు, స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా స్కూల్ సమయాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తిరిగే ప్రాంతంలో దొంగలు ఇంత ధైర్యంగా వ్యవహరించడం భద్రతాపై అనుమానాలు కలిగిస్తోంది. రాత్రి వేళల్లో పోలీస్ పహారా మరింత పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు.



పరిసర ప్రాంతాల్లోని ఇతర కెమెరాల దృశ్యాలను కూడా పరిశీలిస్తూ దొంగలు వెళ్లిన మార్గాలను ట్రేస్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఉప్పల్ బీరప్పగడ్డలో జరిగిన ఈ ఘటనతో స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను భద్రత కలిగిన ప్రదేశాల్లో మాత్రమే పార్క్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

# మేడ్చల్ జిల్లాలో ఘనంగా మే డే వేడుకలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 1 (జనంసాక్షి):** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమాజ నిర్మాణంలో కార్మికుల సేవలను స్మరించుకుంటూ వారి కృషికి అధికారులు ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ మిక్కిలినేని మనూ చౌదరి, ఐఏఎస్ కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికుల కష్టం సమాజ అభివృద్ధికి ప్రధాన బలం అని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధికి కార్మికులే వెన్నెముక అని అన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, న్యాయమైన వేతనాలు, సురక్షితమైన పనివాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్మిక సంక్షేమం కోసం జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్మిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అంజనేయులు, ఈఎస్ఐ విభాగానికి చెందిన డా. కనకదుర్గాదేవి, ఐటీఐ మేడ్చల్ ప్రిన్సిపాల్ హనుమా నాయక్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మనోహర్ రెడ్డిలను ప్రశంసిస్తూ సత్కరించారు. బాల కార్మికత్వం నుంచి రక్షించబడి ప్రస్తుతం విద్యాభ్యాసం కొనసాగిస్తున్న కుమారి మీనాను "బెస్ట్ చైల్డ్ సర్వైవర్"గా గుర్తించి ప్రత్యేకంగా సన్మానించారు. ఆమె పట్టుదల,



విద్యపై ఆసక్తిని అధికారులు అభినందించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ లక్ష్మీపతి కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ రాధిక నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు సాయి సుమన్, అంజనేయులు కొత్త లేబర్ కోడ్స్, ఉద్యోగుల హక్కులపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్మికులు తమ హక్కులు, సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లాలో కార్మికులకు అవగాహన కల్పించేందుకు మే 2 నుంచి మే 10 వరకు ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ శిబిరాల్లో కార్మిక చట్టాలు, భద్రతా ప్రమాణాలు, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# మే డే సందర్భంగా పంచాయతీ కార్మికులకు ఘన సన్మానం

### పెద్దేముల్ సర్పంచ్ డివై చిన్న నర్సింలు,ఉప సర్పంచ్ డివై ప్రసాద్



పెద్దేముల్ మే 01(జనంసాక్షి) : పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివాని పెద్దేముల్ సర్పంచ్ డివై చిన్న నర్సిములు, ఉప సర్పంచ్ డివై ప్రసాద్ కొనియాడారు. శుక్రవారం మే డే సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ డివై చిన్న నర్సిములు,ఉప సర్పంచ్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుద్ధ కార్మికులకు శాలువా పూలదండతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాని శుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య నిర్వహణ కార్మికుల అహర్నిశల శ్రమను గ్రామ పరిపాలనలో,పారిశుద్ధ్యంలో కీలక పాత్ర పోషిస్తున్నందుకు పంచాయతీ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు సమాజంలో భాగమని వారిని గౌరవించడం మనందరి బాధ్యత,వారు లేనిదే గ్రామ శుభ్రత లేదని అన్నారు. పారిశుద్ధ్యం, ప్రజా సేవల నిర్వహణలో పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వారి అహర్నిశల శ్రమతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

# రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఉప్పల్ మే 01 ( జనం సాక్షి ):** ఉప్పల్ కల్సా సబ్‌స్టేషన్‌కు చెందిన 11 కెవి స్వరూప్‌నగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ ట్రిమ్మింగ్) మరియు నిర్వహణ పనుల కారణంగా మే 2న ఉదయం 10:30 గంటల నుంచి 11:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ ఉప్పల్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం. నిఖిల్ తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయం సౌత్ స్వరూప్‌నగర్, కేకేఆర్ గార్డెన్ లేన్, గాంధీనగర్, అంబేద్కర్ నగర్ మరియు పరిసర ప్రాంతాల్లో ఉండనుంది. ప్రజలు విద్యుత్ శాఖ నిర్వహణ పనులకు సహకరించాలని అధికారులు కోరారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## గ్లాండ్ ఫార్మా కంపెనీ మేడే వేడుకలో
## పాల్గొన్న మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్



**నిజాంపేట్ మే 1( జనం సాక్షి)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని (డి. పోచంపల్లి) ఉన్నటువంటి గ్లాండ్ ఫార్మా కంపెనీలో శుక్రవారం జరిగిన మే డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు కార్మిక సంఘం అధ్యక్షులు కూన శ్రీశైలం గౌడ్ హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశ అభివృద్ధి, మన రాష్ట్ర పురోగతి ఇవన్నీ కూలీల చెమటతో, కార్మికుల కష్టం తోనే సాధ్యమయ్యాయని నిత్యం కష్టపడే ప్రతి కార్మికుడి వెనుక ఒక కుటుంబం, ఒక ఆశ, ఒక భవిష్యత్తు ఉంటుంది. వారి కష్టం లేకుండా మన జీవితం ఊహించలేమని,అయితే ఇంకా చాలామంది కార్మికులు సరైన వేతనం, భద్రత, గౌరవం కోసం పోరాడుతున్నారు. ఇది మనందరి బాధ్యత అని తెలిపారు. అదేవిధంగా స్థానిక గ్రాండ్ ఫార్మ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న వారు కంపెనీ యజమాన్యంతో మాట్లాడి వారి వేతన సవరణతో పాటు వారికి రావలసింది బకాయిలు చెల్లించాలని వారి న్యాయమైన డిమాండ్లను సైతం పరిష్కరించాలని కంపెనీ యాజమాన్యానికి తెలియజేస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో గ్లాండ్ ఫార్మా కంపెనీ కార్మికుల సంఘం ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి, కృష్ణారెడ్డి మరియు కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో మౌలిక సదుపాయాల సమస్యలు

**ఉప్పల్ మే 01 ( జనం సాక్షి ):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉప్పల్ ఇండస్ట్రియల్ ఏరియా, చిల్కానగర్ పరిసరాల్లో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య తీవ్రంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, సరైన నిర్వహణ లేకపోవడం



కారణంగా కాలువలు పొంగిపొర్లుతూ రోడ్లపైకి మురుగు నీరు చేరుతోంది. ఉప్పల్ ఇండస్ట్రియల్ ఏరియాలోని పలు వీధుల్లో డ్రైనేజీ నీరు రోడ్లపై నిల్వ ఉండటంతో వాహనదారులు, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటి దుర్వాసనతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తుండగా, దోమలు పెరిగి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. చిల్కానగర్ ప్రాంతంలోని కొన్ని కాలనీల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని, చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా మురుగు నీటిని తొలగించడం తప్ప సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపడం లేదని ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ లైన్లను పూర్తిగా శుభ్రం చేయడంతో పాటు, పాత పైపులైన్లను మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇక మరోవైపు ఉప్పల్ మెయిన్ రోడ్డుపై పెరుగుతున్న శబ్ద కాలుష్యం కూడా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. భారీ వాహనాలు, నిరంతరం వినిపిస్తున్న హారన్ శబ్దాలు, రాత్రి వేళల్లో వేగంగా దూసుకెళు న్న వాహనాల కారణంగా స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా స్కూళు , ఆసుపత్రులు, నివాస ప్రాంతాల సమీపంలో శబ్ద కాలుష్యం అధికంగా ఉండడం వల్ల విద్యార్థులు, వృద్ధులు, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కఠినంగా అమలు చేయాలని, అనవసరంగా హారన్ మోగించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రి సమయంలో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. మౌలిక సదుపాయాల సమస్యలు, పెరుగుతున్న కాలుష్యంపై అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ఉప్పల్ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# మే డే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల సాధనకై ఉద్యమించాలి

## ఏఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు కే.రామస్వామి



**చేవెళ్ల, మే 01 (జనంసాక్షి)** ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల సాధన కోసం వ్యవస్థ పై ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు కే.రామస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం చేవెళ్లలోని భూ పోరాట కేంద్రంలో నిర్వహించిన 141 వ మే డే ఉత్సవాలు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు జిల్లా అధ్యక్షుడు కే.రామస్వామి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఉద్యమాలు త్యాగాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను నేడు ప్రపంచీకరణ చేతుల్లో కీలుబొమ్మగా మారిందన్నారు. ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, వాటి రక్షణ కోసం జరిగే పోరాటంలో కార్మికులంతా ఎర్రజెండా నీడలో ప్రభుత్వాలపై తెగించి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. 140 సంవత్సరాల క్రితం సాధించిన ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసే పన్నెండు గంటల పని విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని, దానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని దాని స్థానంలో 29 చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వెలు ఇవ్వాలని, లేదా కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేసి ఆప్కో విధానాన్ని కేటాయించాలని, అదే విధంగా కార్మికులకు ఈఎస్ఐ పీఎఫ్ బోనస్ గ్రాటివిటీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మే డే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల సాధనకై ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి.మక్బూల్ మండల పార్టీ కార్యదర్శి మల్లారి సత్తి రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల, పెంటయ్య, యాదయ్య, వెంకటమ్మ, నరసయ్య, లలిత, వెంకటమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బాల భరోసా స్క్రీనింగ్ సెంటర్ ప్రారంభం

## చిన్నారుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 1 (జనంసాక్షి)** ప్రజా ప్రభుత్వం కార్యక్రమం, ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మల్కాజిగిరిలో ఏర్పాటు చేసిన "బాల భరోసా స్క్రీనింగ్ సెంటర్"ను జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 0--5 సంవత్సరాల పిల్లల్లో పెరుగుదల లోపాలు, మూగతనం, చెవిటితనం, మాటలు ఆలస్యంగా రావడం వంటి సమస్యలను ముందుగానే గుర్తించి వైద్య సహాయం అందించడమే "బాల భరోసా" పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చిన్నారుల ఆరోగ్య రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద ఐదేళ్లలోపు పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైతే ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక వైద్య బృందాలు పిల్లల్లో న్యూరో డెవలప్మెంట్ సమస్యలు, వికలాంగత లక్షణాలను ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తున్నాయని వెల్లడించారు.జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడి భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాధా మాట్లాడుతూ పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా, సురక్షితంగా ఎదగడానికి ఈ పథకం బలమైన ఆధారంగా నిలుస్తుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరి మాట్లాడుతూ పిల్లలకు పోషకాహారం అందించడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని, పిల్లల సంక్షేమం, భద్రత, అభివృద్ధి కోసం "బాల భరోసా" పథకం కీలకంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ మహాలక్ష్మి, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ శోభ, డిప్యూటీ డీఎంహెచ్‌వో లావణ్య, అల్వాల్ సీడీపీఓ స్వాతి, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ తిరుమల దేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్ రహీం, ఆశా వర్కర్లు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, చిన్నారులు మరియు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరింది

## మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి



**మోమిన్ పేట మే 01 (జనం సాక్షి)** ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లతో కల నెరవేరిందని . మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి పేర్కొన్నారు శుక్రవారం మోమిన్ పేట మండలంలో నీ మేక వనంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన కోటపల్లి యాదయ్య అనసూజమ్మ ఇందిరమ్మ ఇంటిని ఘనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడైనా ఏనాడైనా పేదల పక్షాన ఉంటుందని పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మేనిఫెస్టో లో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్నె శంకర్ యాదవ్ మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కోసిగి సురేందర్ ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు. సీనియర్ నాయకులు , స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికుల కఠోర శ్రమతో జరుపునే వేడుక మేడే

## కార్మిక నాయకులు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**నిజాంపేట్ మే1( జనం సాక్షి)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ డి.పోచంపల్లిలోని ఆల్కాలి మెటల్స్ లో మేడే కార్యక్రమాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన యూనియన్ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి కార్మిక విభాగం సలహాదారులు, బీఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే, కెపి వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే డే అనేది తమ శక్తితో మన సమాజాన్ని నిర్మించే కార్మికుల కఠోర శ్రమ, అంకితభావం త్యాగాలకు జరుపుకునే వేడుక పరిశ్రమలు కార్మికుల హక్కులను గౌరవించాలని, న్యాయమైన వేతనాలను అందించాలన్నారు. ఈ సందర్భంగా కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్కలి మెటల్స్ యూనియన్ నూతన అధ్యక్షులు ఓ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్లు బి. మహేందర్, ఎండి. సిద్దిక్, కె.వీరాస్వామి, ఉపాధ్యక్షులు నరేష్ చారి, సతీష్, కోశాధికారి బాలరాజు, జాయింట్ సెక్రటరీ లో బసవ చారి, శీను, యూనియన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, కోల సాయి యాదవ్, పాక్స్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, డైరెక్టర్ జీతయ్య, సీనియర్ నాయకులు కోర్వి రాము, వార్డు ప్రెసిడెంట్ సుదర్శన్, నాయకులు వేణు గౌడ్, శ్రీకాంత్ యాదవ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల రక్తతర్పణతో సిద్ధించిన రోజుకు 8 గంటల పని విధానాన్ని కాపాడుకుందాం

## సిఐటియు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్



**హయత్ నగర్, మే 01 (జనం సాక్షి)** ఆటోనగర్ లోని టి సి ఐ కంపెనీ ముందు టి సి ఐ కార్మికులు, టైర్ వర్కర్స్ యూనియన్ ల ఆధ్వర్యం లో నిర్వహించిన మేడే కార్యక్రమానికి సిఐటియు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ ముఖ్యఅతిథిగా హాజరై, జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ కార్మికులకు వచ్చిన ఎనిమిది గంటల పని విధానము కార్మికుల రక్త తర్పణ వల్ల సిద్ధించిందని అన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు రావడానికి కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్నారని తెలియజేశారు. కానీ మోదీ ప్రభుత్వము నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందని, కార్మికుల సమ్మె చేసే హక్కులు కూడా హరించి వేస్తుందని వీటన్నిటికీ వ్యతిరేకంగా మేడే స్ఫూర్తితో కార్మికులు అనేక పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు హయత్ నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య, సిఐటియు నాయకులు బూరెల్ల భాస్కర్, టిసిఐ కార్మిక సంఘం నాయకులు దయానంద్, సుధీర్, టైర్ వర్కర్స్ యూనియన్ నాయకులు మెట్టు లింగం యాదవ్, లింగస్వామి, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలి

## మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



**మర్పల్లి మే 01 (జనంసాక్షి)** ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం మర్పల్లి మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ఉన్న శ్రీ భద్రేశ్వర స్వామి జాతర మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంటు రమేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

## ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, మే 1(జనం సాక్షి )** ఆలయ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం రాత్రి మున్సిపల్ కేంద్రంలోని స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం వద్ద బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవం ఆలయ ఈవో అధికారి దేవరశెట్టి ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో ఆలయ భక్త బృందం సహాయ సహకారాలతో వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వయంభు క్షేత్రం ఎంతో మహిమగల క్షేత్రమని భక్తులకు కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా వెలిసిందని పేర్కొన్నారు. వందల ఏళ్ల క్రితం స్వయంభుగా వేసే లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి రాష్ట్ర నలుమూలల నుంచి నిత్యం వేలాది భక్తులు వస్తుంటారు అన్నారు. ఆలయ భక్త బృందం కళ్యాణోత్సవం విషయం తన దృష్టికి తీసుకురాగా వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి ప్రత్యేకంగా ప్రోటోకాల్ గా ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించేటట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇప్పటికే కళ్యాణం ఉత్సవంలోని పలు కార్యక్రమాలకు ప్రభుత్వమే విధులు వెచ్చిస్తుందని, భవిష్యత్తులో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తను స్వయంగా నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి దేవాలయం త్వరలోనే ప్రారంభమై కలియుగ వైకుంఠంగా వెల్లి విరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్మన్ ముత్యాల శ్యామల భాస్కర్, కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు ఆలయ భక్త బృందం, వందలాదిమంది ప్రజలు తదితరులు పాల్గొన్నారుద.

# పదో తరగతి ఫలితాల్లో కాకతీయ టెక్నో హైస్కూల్ ప్రభంజనం

- **583 మార్కులతో దేదీప్య సంచలనం**
- **561 మార్కులతో వెన్నెల మెరుపు**



కూకట్‌పల్లి, మే 01 (జనంసాక్షి ): జగద్గిరిగుట్టలోని కాకతీయ టెక్నో హైస్కూల్ మరోసారి పదో తరగతి ఫలితాల్లో తన సత్తా చాటింది. 2026 ఎస్సెస్సీ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాల ఖ్యాతిని మరింత ఎత్తుకు తీసుకెళ్లారు. పాఠశాల విద్యార్థిని డోగిపర్తి దేదీప్య ఏకంగా 583 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచి సంచలనం సృష్టించింది. మరో విద్యార్థిని పద్దాని వెన్నెల 561 మార్కులు సాధించి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. టాప్ ర్యాంకులతో విద్యార్థులు మెరవడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ విజయోత్సాహ వాతావరణంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. పూలమాలలు, శాలువాలతో అభినందనలు తెలిపి విద్యార్థుల విజయాన్ని సంబరంగా జరుపుకుంది. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల కష్టపాటు, ఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారమే ఈ ఘన ఫలితాలకు కారణమని తెలిపారు. క్రమశిక్షణతో కూడిన బోధన, నాణ్యమైన విద్య అందించడం వల్లే ప్రతి ఏడాది మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కాకతీయ టెక్నో హైస్కూల్ విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పూర్తి ఉత్తీర్ణత శాతంతో పాటు అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఈ ఫలితాలు చర్చనీయాంశంగా మారాయి.

# మే డే స్ఫూర్తితో కార్మికుల హక్కుల పోరాటం

## సిఐటియు షాబాద్ మండల కన్వీనర్ శ్రీనివాస్



**షాబాద్, మే 01 (జనం సాక్షి) :** పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని సిఐటియు షాబాద్ మండల కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. సిఐటియు షాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మేడే కార్మికుల దినోత్సవం పురస్కరించుకొని షాబాద్ మండల పరిధిలోని అంతారం మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం వద్ద మరియు షాబాద్ మండల కేంద్రంలో, అలాగే పరిధిలోని నాగర్ గూడ, తిరుమలాపూర్, తాళ్లపల్లి, నాగర్కుంట, నరెడ్లగూడ, కేసారం,కక్కులూరు తదితర గ్రామాలలో సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు షాబాద్ మండల కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కార్ల్ మార్క్స్ చెప్పినట్టుగా పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప ప్రపంచ కార్మికులారా ఏకంకండి అన్నా నినాదంతో షాబాద్ మండల కార్మికులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తుందని కార్మికుల చట్ట వ్యతిరేక విధానాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పై నిరంతరం పోరాటం చేస్తూ, దేశంలోనే పెద్ద కార్మిక సంఘంగా సిఐటియు ఎదిగిందని అన్నారు. షాబాద్ మండల పరిధిలోని కార్మికులకు ఏ సమస్య వచ్చినా సిఐటియు ముందుంటుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గ్రామపంచాయతీ యూనియన్ షాబాద్ మండల అధ్యక్షులు వర్గ సత్తయ్య, రైతు సంఘం మండల నాయకులు గడ్డమీద లక్ష్మయ్య, సిఐటియు మండల నాయకులు నరసింహ, కృష్ణ, యాదయ్య, అర్జున్, రవి, మిషన్ భగీరథ యూనియన్ నాయకులు శ్రీకాంత్, మహేష్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ రేణుకా ఎల్లమ్మ జాతర

**కోట్ పల్లి మే 01(జనం సాక్షి ):**కోట్ పల్లి మండల పరిధిలోని నాసన్పల్లి గ్రామ సమీపంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద జాతర మహోత్సవాన్ని భక్తులు, గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం నాడు తెలంగాణ సంప్రదాయ సంస్కృతులు ఆచారాలను అనుసరిస్తూ.. గ్రామంలోని మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.. భక్తులకు, గ్రామ ప్రజలకు కనువిప్పు కలిగేలా ఉగ్గడోలు, డప్పు సొన్నాయిలు లతో విన్యాసాలతో ఆకట్టుకున్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామంలో గ్రామ పెద్దలు భక్తులు ప్రజలు మహిళలు యువకులు పాల్గొన్నారు.

# ఆలయానికి భక్తులు ఎంత అవసరమో దాతలు అంత ముఖ్యం

## ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి




**తాండూరు మే 1(జనంసాక్షి)** శ్రీ పాంబడ రామలింగేశ్వర స్వామి ఆలయానికి ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి డీజే బాక్స్ వితరణ చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కులకచర్ల ప్రాంతం బండవెల్కిచర్ల గ్రామ సమీపం లోని ఆహ్లాదకరమైన వాతావరణలో ఎకశిలపై కోలువుదీరిన శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆలయ గిరి ప్రదక్షణ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇచ్చిన మాటప్రకారం ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ఆలయానికి డీజే బాక్స్ అందజేశారు.. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పాడు శర్మస్వామిప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్ష ప్రారంబించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కోరిన వెంటనే ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యనిశ్రీనివాస్ రెడ్డి ఆలయానికి డీజే బాక్స్ అందజేయడం సంతోషకమన్నారు. పరమేశ్వరుని కృపతో ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి తలపెట్టిన కార్యక్రమాల్లో దిగ్విజయంగా ముందుకు సాగాలని ఆశీస్సులు అందజేశారు. పరమేశ్వరుని ఆశీస్సులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి కుటుంబం పై నిరంతరం ఉండాలని పరమేశ్వరుని వేడుకున్నారు. అదేవిధంగా దాతలు ముందు కోచ్చి ఆలయ ఆబివృద్ధికి సాకరించాలని కోరారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**షాబాద్, మే 01(జనం సాక్షి) :** సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని, రసాయన మందులు వాడి ప్రకృతిని కాపాడాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ బద్రు, డాక్టర్ కిరణ్, మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని తాళ్లపల్లి రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, రాబోయే వానాకాలం (ఖరీఫ్)-2026 సీజన్ కు సంబంధించి వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు ముఖాముఖి సమావేశం తాళ్లపల్లి సర్పంచ్ స్వాతి తో కలిసి మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి సర్పంచ్ స్వాతి మాట్లాడుతూ... రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులను వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలి అన్నారు. మా క్లస్టర్ పరిధిలో పచ్చి రొట్ట విత్తనాలు జనుము, జీలుగ విత్తనాలు ఎక్కువ మొత్తంలో ఇవ్వాలని కోరారు. అలాగే డాక్టర్ భద్రు మాట్లాడుతూ... మొక్కజొన్న పైరులో మేలైన విత్తన రకాలు, వరిలో నాణ్యమైన విత్తనాల ఎంపిక, కొత్త సాంకేతిక పద్ధతులు, మెరుగైన సాగు విధానాలు, ఎరువుల వినియోగం, చీడ-పీడల యజమాన్యం, నీటి నిర్వహణ గురించి వివరించారు. అలాగే డాక్టర్ కిరణ్ బాబు మాట్లాడుతూ... తక్కువ యూరియా వాడకం, సాగు ఖర్చులు తగ్గించాలి, అవసరం మేరకే రసాయన ఎరువులు వినియేగించి, ప్రకృతిని కాపాడాలన్నారు. పంట మార్పిడి పాటించి మార్కెట్లో గిరాకీ ఉన్న పంటలు సాగు చేసుకోవాలి. అలాగే సాంకేతిక వ్యవసాయ సలహాలు, సూచనలు తెలియ చెప్పారు. మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర మాట్లాడుతూ... రైతులు పంటలు సాగించే ముందు భూసార పరీక్షలు చేపట్టి భూసారాన్ని బట్టి పంట సాగు చేయాలని అన్నారు. రసాయన ఎరువులు పురుగుమందులు వినియోగం తగ్గించాలని సూచించారు. పంటలు సాగు చేసే ముందు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని చెప్పారు. విచక్షణ రహితంగా పురుగు మందులు, రసాయన ఎరువులు వాడడం వలన పర్యావరణ కాలుష్యం పెరిగి మనుషులు అనేక రోగాల బారిన పడి వైద్య ఖర్చులు భారం పెరుగుతుంది కావున రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారావు గూడ సర్పంచి కుమార్, ఎట్లఎర్రవల్లి సర్పంచ్ నరసింహులు,వ్యవసాయ విస్తరణ అధికారులు గీత,శివతేజ, హార్టికల్చర్ విస్తరణ అధికారి బలరాం, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, నాయకులు, వివిధ గ్రామల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ నాయకులు ఇందారపు ఎల్లయ్య ఆధ్వర్యంలో 141 వ మే డే వేడుకలు



**నిజాంపేట్ మే1( జనం సాక్షి)** కుతుబుల్లాపూర్ నియోజకవర్గ దుండిగల్ సర్కిల్ 59 పరిధిలోని గండి మైసమ్మ చౌరస్తా వద్ద సిపిఐ నాయకులు ఇందారపు ఎల్లయ్య ఆధ్వర్యంలో 141 వ మే డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేడే జెండాను ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ చికాగోలో జరిగిన కార్మికుల పని గంటల ఉద్యమం మొదలై ఎంతోమంది ప్రాణాల బలిదానం ఫలితంగా ఈ మేడే ను అంతర్జాతీయ దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు. చెప్పారు. ఈ కార్యక్రమంలో రవీందర్ గౌడ్, పీరయ్య, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులను కాల రాస్తే కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదు

## కార్తికేయ ఇండస్ట్రీస్ బి ఆర్ టి యు అధ్యక్షులు వి రామాచారి



**మోమిన్ పేట మే 01 (జనం సాక్షి)** కార్తికేయ పరిశ్రమ లో పనిచేసే కార్మికుల హక్కులను కాలరాయడానికి ప్రయత్నిస్తే బి ఆర్ టి యు కార్మిక విభాగం చూస్తూ ఊరుకోదని బి.ఆర్.టి.యు కార్మిక విభాగం అధ్యక్షులు బి రామాచారి పేర్కొన్నారు శుక్రవారం మోమిన్ పేట మండల పరిధిలోని మో రంగపల్లి కార్తికేయ పరిశ్రమలో మే డే సందర్భంగా కార్మికజెండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .పోరాడి సాధించుకున్న 39 కార్మిక చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు కార్మిక కోడ్లుగా మారుస్తూ యాజమాన్యాలకు అనుకూలమైన చట్టాలను రూపొందించడం జరిగిందని, దీని మూలంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న: కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుగుణంగా.మార్చడం ఎంతవరకు సమంజసమని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలను అన్నింటిని అప్పనంగా , ఆదాని, అంబానీ.లకు కారు చౌకగా కట్టబెడుతూ .లక్షల కోట్ల రూపాయలను తన అనుయాయులకు లాభలు చేకూరుస్తున్నారని, ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర .రాష్ట్ర ప్రభుత్వాలు ఇది కార్మిక వర్గానికి తీవ్ర నష్టం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనాలు 28 వేల రూపాయలు పెంచాలని, కార్మిక వర్గానికి ఈఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్, లాంటి పథకాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గం, తమ హక్కుల కోసం పోరాడితే, కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు, వారి హక్కులను కాలరాస్తూ, లాఠీచార్జీలు చేస్తూ, బలవంతపు అరెస్టులు చేస్తూ, కార్మికులను వేధింపులకు, గురి చేస్తున్నారని, ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం, కార్మికులకు రక్షణగా, అండగా, బి ఆర్ టి యు ఉంటుందని కార్మికులకు తెలియజేశారు. కార్మిక వర్గం తమ హక్కుల సాధన కోసం, ఐక్యంగా ఉండి, పోరాటాలకు, సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్తికేయ కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి ఎల్ రవి. ఎన్ ప్రవీణ్. కోశాధికారి బి నర్సింలు. ఏ అవసరా మాలు. కే మాణిక్యం. ఓ శ్రీనివాస్ . జి దేవరాజ్. నాగేష్ ఎన్ ప్రవీణ్ మరియు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

# 10 ఫలితాలలో శేరిలింగంపల్లి శ్రీ చైతన్య పాఠశాల ప్రభంజనం



**శేరిలింగంపల్లి, మే 01 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసినటువంటి ఎస్.ఎస్.సి ఫలితాలలో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో ప్రభంజనం సృష్టించారని శేరిలింగంపల్లి శ్రీ చైతన్య పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. వాణి ప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు మాట్లాడుతూ గతేడాది వరకు రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతిలో గ్రేడ్ విధానాన్ని అమలు చేయడం జరిగిందని, ఈ ఏడాది మార్కులనే ప్రాతిపదికగా తీసుకోవడం జరిగిందన్నారు. పదవ తరగతికి సంబంధించి 600 మార్కులకు 584 మార్కులతో కె. సంహిత స్కూల్ మొత్తానికి ప్రథమ స్థానంలో నిలవగా ఎం. మోక్షిత 580 మార్కులు, ఆర్. సాయి ప్రప్రజ్ఞ శ్రీ, వి. లిప్సిక సైతం 580 మార్కులు సంపాధించి వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలవడం జరిగిందన్నారు. అదేవిధంగా 570 ఆపైన మార్కులను 21 విద్యార్థులు సాధించగా, 560 మార్కులను 18 మంది, 550 ఆపైన మార్కులను 58 మంది విద్యార్థులు, 500 ఆపైన మార్కులను 124 విద్యార్థులు సాధించారని ప్రిన్సిపల్ కె. వాణి ప్రసాద్ వెల్లడించారు. బ్రాంచి యావరేజ్ 523, ఉత్తీర్ణత శాతం 100 సాధించడంపట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుతమైన ఫలితాలు సాధించడానికిగల కారణాలను వివరిస్తూ సకాలంలో పాఠ్యాంశాలను పూర్తి చేసుకొని, పునఃశ్చరణ తరగతుల నిర్వహించడం, విద్యార్థులకు కరికులంతో సహా కోకరికులం అంశాల పట్ల ప్రత్యేక ఆసక్తిని పెంపొందించడం విజయ రహస్యం అన్నారు. ఎప్పటికప్పుడు ఉత్తమ ఫలితాలను సాధించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తూనే తగిన సలహాలు సూచనలను అందజేస్తూ వారి లక్ష్యం వైపు మొక్కవోని ఆత్మవిశ్వాసంతో దూసుకు వెళ్లేలా శ్రీ చైతన్య ఉపాధ్యాయ బృందం నిరంతర సాధనను కొనసాగిస్తుందన్నారు. ఉపాధ్యాయుల నిరంతర శ్రద్ధ, విద్యార్థుల విషయంలో అనుసరిస్తున్న విధానాన్ని ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం శివరామకృష్ణ, ప్రాంతీయ ఇన్చార్జ్ ఎం. హరికృష్ణ, జోనల్ కోఆర్డినేటర్ వెంకట శివ, అకాడమిక్ డీన్ రాజేష్, సి బ్యాచ్ ఇన్చార్జ్ సృజన, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మే డే స్ఫూర్తితో లేబర్ కోడ్ బిల్లును తిప్పికొడదాం



**శేరిలింగంపల్లి, మే 01 (జనంసాక్షి) :** మే డే అంటేనే ఒక ఉద్యమ స్ఫూర్తి, పోరాట పతాకం అని, అందుకే ఇదే మే డే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అమలుకు పూనుకున్న నాలుగు లేబర్ కోడ్ బిల్లులను తిప్పికొడదామని సిఐటియు రంగారెడ్డి జిల్లా నాయకులు జగదీష్ పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన మే డేను పురస్కరించుకొని శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గచ్చిబౌలి చౌరస్తా, చందానగర్, మియాపూర్ తదితర ప్రాంతాల్లో సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మే డే జెండాలను పలువురు సిఐటియు నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా వేదికలపై మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొడదామని, కార్మికుల హక్కులను కాపాడదామని, ఎనిమిది గంటల పని విధానాన్ని చట్టబద్ధతతో అమలు చేయాలని జగదీష్ డిమాండ్ చేశారు. చాలా ప్రాంతాలలో బానిసల కంటే హీనంగా కార్మికుల చేత 12 గంటల పని విధానాన్ని కొనసాగిస్తున్నారని, కార్మికుల చెమట చుక్కలతో పెత్తందారులంతా కరెన్సీ కట్టలను జమ చేసుకుంటున్నారని జగదీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను, నూతనంగా అమలు పరచడానికి కోరుకుంటున్నా నాలుగు లేబర్ కోడ్ లను తప్పకుండా వ్యతిరేకించి కార్మికుల హక్కుల పరిరక్షణకై ఏకతాటిపైకి రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను తీసుకువస్తూ పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా చట్టాలను మార్చి వేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను మారుస్తూ దేశంలోని ఖనిజ సంపదను పూర్తిగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు అనేక మార్పులు తీసుకొస్తూ దేశవ్యాప్తంగా గిరిజన రైతు వ్యతిరేక విధానాలను వేగవంతం చేస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్, ఒరిస్సా, మణిపూర్ లాంటి రాష్ట్రాల్లో నేటికీ ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయని వారు గుర్తు చేశారు. కార్మిక కర్షక మేధావులందరూ కలిసి ఈ దేశంలోని ఖనిజ సంపదను భారత దేశ ప్రజలకు అందే విధంగా పోరాటం చేయాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ మే డే స్ఫూర్తితో మరిన్ని పోరాటాలకు సిద్ధపడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు షేర్లింగంపల్లి జోన్ కార్యదర్శి కొంగర కృష్ణ , నాయకులు మాణిక్యం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ డిపోలో ఘనంగా మే డే వేడుకలు



**బోడుప్పల్-జనంసాక్షి** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో వద్ద ఘనంగా జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ, కార్మికుల హక్కుల సాధనలో ఐక్యతే ప్రధాన బలం అని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు సంఘటితంగా పోరాడితేనే తమ హక్కులను కాపాడుకోగలరని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వేతనాలు, ఉద్యోగ భద్రత, పని పరిస్థితుల మెరుగుదల వంటి అంశాలను ప్రస్తావించారు.ప్రభుత్వం కార్మికులకు అనుకూలంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు, యూనియన్ సభ్యులు పాల్గొని కార్మిక ఐక్యతను చాటిచెప్పారు.అనంతరం కార్మిక నాయకులు కార్మిక ఉద్యమ చరిత్ర, మే డే ప్రాముఖ్యతపై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, రాష్ట్ర నాయకులు శాంతి కుమార్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ధనంజయ్ ,పరమేష్, కృష్ణ ,ఎంఎస్ నారాయణ, కాంత రావు ,ఎం శ్రీనివాస్ ,డిఎన్ రెడ్డి, బాలయ్య, బాలాకృష్ణ,ఏఐటీయూసి నాయకులు రమేష్, సిపిఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్, ప్రమీల, మాధవి, మహాలక్ష్మి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రామిక వర్గ హక్కులను గుర్తించే చారిత్రాత్మక దినోత్సవం మేడే

## 24వ వార్డు కౌన్సిలర్ పోలీసు బాలకృష్ణారెడ్డి



**తాండూరు మే 1(జనంసాక్షి)** అహర్నిశలూ శ్రమిస్తున్న శ్రామిక వర్గ హక్కులను గుర్తించే చారిత్రాత్మక దినోత్సవం మేడే అని 24వ వార్డు కౌన్సిలర్ పోలీసు బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు.అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం తాండూరు పట్టణం మున్సిపల్ జవాన్లు మరియు కార్మికులకు 24 వ వార్డు కౌన్సిలర్ పోలీస్ బాలకృష్ణారెడ్డి శాలువా తో పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ పోలీసు బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతూ అభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్నారని అభినందించారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ సమాజ పురోగతికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.వారి కష్టంతోనే సమాజం ముందుకు సాగుతుందని అన్నారు.అహర్నిశలూ శ్రమిస్తున్న శ్రామిక వర్గ హక్కులను గుర్తించే చారిత్రాత్మక దినోత్సవం మేడే అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, మున్సిపల్ జవాన్లు, కార్మికులు తదితరులు ఉన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతిభకు గుర్తింపు



**పూడూర్ మే1 (జనం సాక్షి):** పూడూర్ మండలం కండ్లపల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతిభకు గుర్తింపు లభించింది.గత 15 రోజుల క్రితం పి ఆర్ ఆర్ డి కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో అధిక సంఖ్యలో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించడంలో కండ్లపల్లి గ్రామం ప్రత్యేకంగా నిలిచింది. అలాగే ఎన్ ఎం ఎం ఎస్ యాప్‌లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో కండ్లపల్లి గ్రామం నిలవడం విశేషం.

ఈ విజయానికి కారణమైన ఫీల్డ్ అసిస్టెంట్ కరీం ఖాన్ పనితీరును అభినందిస్తూ, జిల్లా డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఎంపీడీవో పాండు , ఏపీవో అశోక్ కుమార్, చేతుల మీదుగా నగదు చెక్ అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి, పారదర్శకతతో కూడిన పనులు, కూలీలకు సమయానికి ఉపాధి కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్ చేసిన కృషి ప్రశంసనీయమని తెలిపారు. మరింత సమర్థవంతంగా పని చేసి

# మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలు నిర్వహిద్దాం

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ రాజు**

**జనం సాక్షి (ఫరూఖ్ నగర్) :**

141వ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే నేడు 1886 మే 1వ తేదీన చికాగో నగరంలో జరిగిన కార్మిక వర్గ పోరాటంపై విచక్షణ రహితంగా పెట్టుబడిదారీ వర్గం జరిపిన కాల్పుల్లో 5వేల మందికి పైగా కార్మికులు ప్రాణాలర్పించారు. దాని గుర్తుగానే నేటికీ ప్రపంచ కార్మిక దినోత్సవం జరుపుకుంటాం అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ రాజు అన్నారు ఈరోజు షాద్నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్ అధ్యక్షతన జరిగిన మేడ ఉత్సవాలు కార్యక్రమాలలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం. 44 చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చి కార్మికవర్గాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని ఎన్నికల్లో ఒక మాట, ఎన్నికల తర్వాత ఒక మాట మారుస్తుందని. ఇదేనా ప్రజాస్వామ్యం అంటే? అని అడుగుతున్నాం. మే 1వ తేదీ స్ఫూర్తితో ప్రపంచ పోరాటాలతో పాటు మన దేశంలో కూడా అనేక పోరాటాలు జరిగాయి. వామపక్ష పార్టీ సంఘాలు తప్ప ఏ సంఘాలు కూడా కార్మిక చట్టాలు కట్టుబడి లేవు. వచ్చే కార్మికులు కూడా ప్రలోభాలకో, భయానికో, భక్తికో, బూర్జువా పార్టీలకు సంబంధించిన కార్మిక వర్గ సంఘాలలో ఉంటున్నారు. అంటే కార్మిక వర్గాన్ని నష్టపరచాలని ఆలోచిస్తూ ఉన్న సంఘాలకు తగిన బుద్ధి చెప్పాలి. కార్మిక వర్గం పక్షాన నిలబడే వామపక్ష సంఘాలను, అలాగే సీఐటీయూ తదితర సోదర సంఘాలను ఆదరించండి. కార్మికవర్గ చైతన్యంతో ప్రభుత్వాలను నిర్బంధించండి. ఈ ప్రభుత్వాలపై మన కుటుంబాలు మన మీద ఆధారపడి జీవించే వారందరికి చైతన్యం కలిగించండి.




ఎన్నికల్లో వారిని ఓడించకపోతే నిరంతరం మనకు కష్టాలు తప్పవు. మన చట్టాలను కాపాడుకుంటూనే అనుకూలమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి. అనుకూలమైన ప్రభుత్వం అంటే బూర్జువా పార్టీలు కావు వాళ్ళు మాటలు మార్చే ప్రభుత్వాలు అబద్దాలు చెప్పే ప్రభుత్వాలు. అందుకోసం వామపక్ష పార్టీలను ఎన్నుకోవాలని మేడే సందర్భంగా కార్మికవర్గానికి విన్నవిస్తున్నా అని వారు అన్నారు కార్యక్రమంల యుటిఎఫ్ సీనియర్ నాయకులు వెంకటరమణ జిల్లా కార్యదర్శి నరసింహులు. వెంకటయ్య శివారెడ్డి బిజిలి సత్యం రవికుమార్ రాములు బాలయ్య హునియా నాయక్ మున్సిపల్ యూనియన్ అధ్యక్ష యాదయ్య రాజు వెంకటయ్య ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు హెచ్ రాములు కె రాములు పాండు నాయక్

హమాలీ సంఘం నాయకులు శ్రీను రవి గ్రానైట్స్ టైల్స్ సంఘం నాయకులు జవహర్ పర్వతా లు శ్రీనివాస్ సమీర్ సిపిఎం పార్టీ నాయకులు బాలరాజు రాజు తదితరులు పాల్గొన్నారు.

# 8 గంటల పనిదినానికి ఉద్యమిద్దాం

**హయత్ నగర్, మే 01 (జనం సాక్షి):** ఈ సందర్భంగా ఎం చంద్రమోహన్ మాట్లాడుతూ, సుమారు 140 సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు ఎనిమిది గంటల పని దినం కోసం చేసిన పోరాటం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. పనికి తగిన ప్రతిఫలం, పని ప్రదేశాల్లో మెరుగైన పరిస్థితులు కల్పించాలని కోరుతూ పెట్టుబడిదారుల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు పోరాడిన ఫలితంగానే ఎనిమిది గంటల పనిదినం సాధ్యమైందన్నారు. 1886 మే 1న జరిగిన ఆ పోరాటాన్ని ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గ పోరాట దినంగా గుర్తిస్తూ మేడేను జరుపుకుంటున్నామని తెలిపారు.

ఆ ఉద్యమంలో ఎనిమిది మంది కార్మిక నాయకులు ప్రాణత్యాగం చేయడం వల్లనే నేడు ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పనిదినం అమలవుతోందని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో నేటి కాలంలో పెరుగుతున్న పనిభారం, పని గంటల పెంపు, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను దెబ్బతీస్తోందని విమర్శిస్తూ, 12 గంటల పనిదినాలను అమలు చేయాలనే ప్రయత్నాలు కార్మిక వ్యతిరేక చర్యలని అన్నారు. కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేయడం ద్వారా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ప్రొఫెసర్ కేశవరావు, డాక్టర్ అరుణ మాట్లాడుతూ, పనిగంటల పెంపు, సమ్మె హక్కుల పరిమితి, తక్కువ వేతనాలతో పని చేయించడం వంటి చర్యల వల్ల కార్మికులపై ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కార్మికులు, కర్షకులు, సామాజిక ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడితేనే తమ హక్కులను కాపాడుకోగలరని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి. రామస్వామి, లేబర్ అడ్డ అధ్యక్షులు ఐక రాజు అంజయ్య, ట్రాన్స్పోర్ట్ యూనియన్ నాయకులు పోలే రమేష్, రాథోడ్ అంజి నాయక్, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, జయమ్మ, లక్ష్మమ్మ, కాశమ్మ, సహాయ కార్యదర్శులు మహేష్, ధనరాజ్, సాయి చరణ్, సచిన్ టెండూల్కర్, మల్లయ్య, నగేష్, కుటుంబరావు, గుండారెడ్డి, కృష్ణయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు

**బోడుప్పల్-జనంసాక్షి :** బోడుప్పల్ సర్కిల్ 11వ డివిజన్ ఇందిరా నగర్ కాలనీ లో చౌరస్తాలో సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు నిర్వహించడం జరిగినది. ఇందిరానగర్ కాలనీ చౌరస్తాలో సిపిఐ పార్టీ మరియు ఏఐటీయూసీ జండాలను సీనియర్ నాయకులు విబి బాలరాజ్ మరియు దండ రమేష్ లు జండా ఆవిష్కరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రచ్చ కిషన్ మాట్లాడుతూ.ప్రతి సంవత్సరం మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది శ్రామికులు అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని – అంటే మేడేని– గర్వంగా జరుపుకుంటారు. ఈ మేడే 1886వ సంవత్సరం అమెరికాలోని చికాగో నగరంలో లక్షలాది కార్మికులు రోజుకు 16 నుండి 18 గంటలు పని చేయవలసిన దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. "రోజుకు 8 గంటలు పని, 8 గంటలు విశ్రాంతి, 8 గంటలు మన కోసం" అనే నినాదంతో కార్మికులు మే 1న సమ్మె బాట పట్టారు. వేల మంది కార్మికులు చికాగో వీధుల్లో శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. మే 4వ తేదీన హే మార్కెట్ స్క్వేర్‌లో జరిగిన సభలో పోలీసులు మూకపై లాఠీలు ఝుళిపించారు. అనామక వ్యక్తి ఒక బాంబు విసిరాడు – పోలీసులు కాల్పులు జరిపారు. అనేక మంది కార్మికులు అమరులయ్యారు. ఆ నాయకులకు ఉరిశిక్ష విధించారు. అయితే వారి బలిదానం వృథ్థం కాలేదు. 1889లో పారిస్‌లో జరిగిన రెండవ అంతర్జాతీయ కార్మిక సమావేశం మే 1వ తేదీని అధికారికంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా ప్రకటించింది. నేడు 80కి పైగా దేశాలు ఈ రోజును జాతీయ సెలవు దినంగా పాటిస్తున్నాయి. భారతదేశంలో తొలిసారి మే డే 1923లో చెన్నైలో జరుపుకున్నారు. కార్మిక నాయకుడు సింగారవేలర్ నేతృత్వంలో నిర్వహించిన ఆ కార్యక్రమంలో మొదటిసారి ఎర్రజెండా రెపరెపలాడింది. అప్పటి నుండి ఈ దేశంలో కార్మికుల ఉద్యమం బలపడుతూ వచ్చింది. తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శిలు సిహెచ్ మాధవి, జి నాగరాజు, బీసీ సంఘం జిల్లా నాయకులు కే ప్రమీల, బాపురాజు, బి కే ఎం యు మండల కార్యదర్శి ఉ అధ్యక్షులు కే మహాలక్ష్మి ,భూతం ఐలయ్య, మండల కౌన్సిల్ సభ్యులు నరసమ్మ, దండు మదర్, తమన్నా,సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారి, సోమరాజు, వెన్నెల ఆటో సంఘం అధ్యక్షులు జి యాకయ్య, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హకీంపేట్ ఆర్టీసీ డిపోలో ఘన సంబరాలు

**శామీర్ పేట్, ఏప్రిల్ 1(జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ మధ్య జరిగిన చర్చలు విజయవంతం కావడంతో హకీంపేట్ ఆర్టీసీ డిపోలో ఘనంగా సంబరాలు నిర్వ హించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు,కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్, ఎస్సీ,ఎస్టీ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ల సమక్షంలో జరిగిన చర్చల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా హకీంపేట్ డిపోలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,మంత్రి పొన్నం ప్రభాకర్,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ కార్మికులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సరితా దేవి,ఎంఫ్ రామ్మోహన్, సెక్యూరిటీ హెడ్ సుదర్శన్, ఆర్టీసీ నాయకులు గోపు శ్రీనివాస్,వెంకటేష్,రామ చందర్ ,కేపీ రావు,రమేష్, రఘు, రాములు, బాల చందర్, విద్యారాణి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పిన్నింటి ధర్మారెడ్డి, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, పారనంది బాల్ రాజు,మహమ్మద్ జాఫర్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరింది

- **ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించినచేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్..!!**

**నవాబుపేట్ మే, 1 (జనం సాక్షి) :**

నవాబ్ పెట్ కుమ్మరి గూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన పిట్టల అనురాధ భర్త అనంతయ్యకు మంజూరైనఇందిరమ్మ ఇంటిని శు క్రవారం ఘనంగా ప్రారంభించిన చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్, గ్రామ సర్పంచి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కుమ్మరిగూడ గ్రామాన్ని ఆదర్శం వంతంగా చేసే విధంగా మా గ్రామానికి ప్రభుత్వం పరంగా నిధులు మంజూరు చేయాలని గ్రామంలో సిసి రోడ్లు, వీధి దీపాలు, మిషన్ భగీరథ నీళు ,, కుమ్మరిగూడ గేటు నుండి గ్రామం వరకు రోడ్డు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి భీమవరత్నం కోరినారు. కోరిక మేరకు జిల్లా మంత్రివర్యులు శ్రీధర్ బాబుతో మాట్లాడి సమస్యలు నెరవేర్చ విధంగా ప్రయత్నం చేస్తానని ఆయన అన్నారు. భీమ్ భరత్ మాట్లాడుతూ

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడైనా ఏనాడైనా పేదల పక్షాన ఉంటుందని పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మేనిఫెస్టో లో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు..

ఈకార్యక్రమంలో నవాబ్ పెట్ మండలం అధ్యక్షులు వెంకటయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు మధు సూదన్ రెడ్డి, జిల్లా మాజీ యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గణపురం ప్రసాద్ కుమార్, నవాబుపేట్ సర్పంచి నరసింహ రెడ్డి, గేట్ వనంపల్లి సర్పంచ్ అనిత ఆంజనేయులు, మీనాపల్లి కలాన్ సర్పంచ్ వెంకటమ్మ, మాదారం



సర్పంచి లావణ్య, కడిచెర్లా, సర్పంచి శ్రీనివాస్, కుమ్మరిగూడ ఉపసర్పంచ్ గోపాలకృష్ణ ,యావాపూర్ సర్పంచ్ శివ నీల లక్ష్మణ్ , పులుమామిడి సర్పంచ్ నరసింహులు ,యాదయ్య , మల్లేష్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తలారిశేఖర్ , మేరాజ్, గోపాల్ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచ్,లు మాజీ ఎంపిటిసిలు గ్రామ కమిటీ అధ్యక్షులు గ్రామం పంచాయతీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలుఇందిరమ్మ కమిటీ మెంబెర్స్ సీనియర్ నాయకులు , స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.